ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

మంగళవారం 8 ఏప్రిల్ 2025

చిన్నారుల కోసం ముందు 'చూపు'



- జిల్లాలోని అంగన్‌వాడీ చిన్నారులకు కంటి పరీక్షలు
- లాంఛనంగా ప్రారంభించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- 587 అంగన్‌వాడీ కేంద్రాలు.. ఆరు బృందాల ద్వారా పరీక్షలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

చిన్నారుల నుంచి పెద్దపిల్లల వరకు అద్దాలతోని పాఠశాలలు, కాలేజీలకు పరుగులు తీస్తూ కనిపిస్తున్నారు. ఏ తరగతి గదికి వెళ్లినా కొందరు పిల్లలైనా అద్దాలతో కనిపిస్తారు. సర్వేంద్రియాల్లో కళ్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. చూపు లేకపోతే మనిషి నిర్వీర్యంగా మారిపోయే ప్రమాదం ఉంది. అత్యంత జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన కళ్లకు వాతావరణ కాలుష్యాలు, విటమిన్లు, పోషకాహార లోపాల కారణంగా జబ్బులు వస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం జాతీయ అంధత్వ నివారణ వారోత్సవాలను నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ప్రతి చిన్నారిని పరీక్షించే విధంగా వంద రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కంటి పరీక్షలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం,



చిన్నారులకు కంటి పరీక్షలు పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత

రాష్ట్రీయ బాలస్వస్థ విభాగం అధికారి డాక్టర్ నయిమా పర్యవేక్షించారు. వందరోజులపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అప్తమాలజీ నిపుణులు పరీక్షలు చేయనున్నారు.

● జిల్లాలో 31,992 మంది చిన్నారులకు పరీక్షలు..

చిన్నారులకు కంటి సమస్యలను ముందస్తుగానే గుర్తించేందుకు అంధత్వ నివారణ వారోత్సవాల్లో భాగంగా ఆరు నెలల నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో సిరిసిల్ల ప్రాజెక్ట్ పరిధిలో 362 కేంద్రాలు, వేములవాడ పరిధిలో 225 కేంద్రాల్లో ఉన్న 31,992 మంది చిన్నారులకు పరీక్షలు చేయనున్నారు. ఆరు బృందాలుగా ప్రతిరోజు 120మంది చొప్పున పరీక్షలు చేసే దిశగా యాక్షన్‌ప్లాన్ రూపొందించారు. అంగన్‌వాడీ కేంద్రాలద్వారా బాలామృతం, కోడిగుడ్లు, పౌష్టికాహారాన్ని చిన్నారులకు అందిస్తున్నారు. ఈక్రమంలోనే అంగన్‌వాడీ కేంద్రాల్లో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అద్దాలు కూడా అందిస్తారు. ముందుగానే గుర్తిస్తే చూపు మందగించడాన్ని అరికట్టవచ్చుని భావిస్తున్నారు. చిన్నారులకు నేత్ర పరిరక్షణ, ఆరోగ్యసూత్రాలపై అవగాహన కూడా కల్పిస్తారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో కంటి పరీక్షల కోసం రూపొందించిన యాక్షన్‌ప్లాన్‌లో 6నెలల నుంచి 2 సంవత్సరాలలోపు పిల్లల్లో బాలికలు 4,392 మంది, బాలురు 4,472 మంది ఉన్నారు. 2 నుంచి 3 సంవత్సరాల వరకు బాలికలు 4,441 మంది, బాలురు 4,583 మంది, 3 సంవత్సరాల నుంచి 6సంవత్సరాల వరకు బాలికలు 6,978 మంది, బాలురు 6,926 మంది ఉన్నారు. వీరికి పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలను తల్లిదండ్రుల పర్యవేక్షణలో నిర్వహించనున్నారు.

● తొమ్మిది రకాల అంశాలపై పరిశీలన..

రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో నిర్వహిస్తున్న నేత్ర పరీక్షలతో పాటు తొమ్మిది అంశాలుగా చిన్నారులను పరిశీలిస్తారు. శారీరక అభివృద్ధి, మానసిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి, ఉద్వేగ అభివృద్ధి, సునిశితచాలక నైపుణ్యాలు, భాష, మాట్లాడే నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ ఆటలు, ఉద్దీపన నైపుణ్యాలతోపాటు..

మిగతా 8లో

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎదురుగట్ల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 12వ తేదీన జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు రావలసిందిగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోయినేని కరుణాకర్, ఆలయ చైర్మన్ సంపేట గంగరాజు, వైస్ చైర్మెన్లు పొన్నం బాలయ్య, నరెడ్ల రాఘవరెడ్డి కమిటీ సభ్యులు కోడెం గంగాధర్, పొన్నం మల్లేశం, సోయినేని రాజు, ఎగుర్ల పర్శయ్య, పొన్నం నాగేందర్, ఆలయ అర్చకుడు కార్తీక్, వాకుళాభరణం శ్రీనివాస్, మర్రిపల్లి మల్లేశం, బండ శ్రీనివాస్, సంఘ స్వామి, పొన్నం రాజేశం తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె

- డీపీవోకు నోటీస్ అందజేత



డీపీవోకు సమ్మె నోటీస్ అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ కార్మికులు ఈనెల 19వ తేదీనుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు సీఐటీయూ ఆల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్ ప్రకటించారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా పంచాయతీ అధికారిని నాయకులు, కార్మికులు కలిసి ఈనెల 19 నుంచి చేపట్టే రాష్ట్రవ్యాప్త సమ్మె నోటీసులను అందించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ 2023 అక్టోబర్‌లో జరిగిన గ్రామ పంచాయతీ వర్కర్ల సమ్మె సందర్భంగా ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి కనీసవేతనం అమలు చేస్తామని, కనీస వేతనం రూ.18వేలు ఇస్తామని, అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీని ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా హామీలను అమలుచేయకపోవడంతోనే సమ్మెలోకి చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సమ్మెలో గ్రామపంచా యతీ కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు బూర శ్రీనివాస్‌గౌడ్, అక్కల అంజాగౌడ్, వర్కోలు మల్లయ్య, లోకిని శ్రీనివాస్, పెంట రాజు, అశోక్, రవి, పల్నాటి బాబు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని కేంద్ర సహాయ మంత్రికి వినతి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి గ్రామంలోని పెద్దమ్మ గుడికి ప్రహరీ గోడకు నిధులు మంజూరుచేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు నాయకులు వినతిపత్రం అందించారు. కరీంనగర్‌లో కేంద్ర సహాయ మంత్రిని కలువగా నిధుల మంజూరుకు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రిని కలిసిన వారిలో గాలిపెల్లి గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘ అధ్యక్షుడు ఎంఢ్ర నారాయణ, కుంబం చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

- కోడెమొక్కులు చెల్లించుకున్న రాజన్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిపోయిన వేములవాడ రాజన్న ఆలయం 6

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా 8

నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలను అందిస్తున్న వనిత

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ మహిళా జిల్లా విభాగం వివిధ మండలాల అధ్యక్షురాళ్లు, కార్యవర్గ సభ్యులకు సోమవారం సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో అధ్యక్షురాలు కాముని వనిత నియామక పత్రాలను అందజేశారు. ఇల్లంతకుంట మండల అధ్యక్షురాలు జ్యోతి, బోయినపల్లి మండల అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, తంగళ్ళపల్లి మండల అధ్యక్షురాలు హారిక, ముస్తాబాద్ మండల అధ్యక్షురాలు వనిత, బ్యాక్ కాంగ్రెస్ మహిళ ప్రెసిడెంట్‌గా రమాదేవి, జిల్లా ఉపాధ్యక్షురాలుగా సామల రోజా, జిల్లా కార్యదర్శి సరితరెడ్డికి జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంను కల్పించి కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీఠ వేసిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం మండల, పట్టణ, జిల్లా కమిటి సభ్యులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మడుపు శ్రీదేవి, మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీయు అధ్యక్షుడిగా శ్రీనివాస్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడిగా తంగళ్ళపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యాడు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో సోమవారం జిల్లా అధ్యక్షుడు బారాజు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె సత్యం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మండల ప్రధాన కార్యదర్శిగా బొంగోని సత్యనారాయణ, కోశాధికారిగా దుర్శేటి రాజయ్య, ఉపాధ్యక్షుడుగా కంకనాల శ్రీనివాస్, కార్యదర్శిగా శంకర్, కార్యవర్గ సభ్యులుగా అశోక్, అనువోజు రాజు, స్వప్నరాణిలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

ఇల్లంతకుంట పంచాయతీ కార్యదర్శిగా సంధ్య

ఇల్లంతకుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట గ్రామపంచాయతీ కార్యదర్శిగా పులి సంధ్యకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఇల్లంతకుంట పంచాయతీ కార్యదర్శి సెలవులలో వెళ్లగా రహీంఖాన్‌పేట పంచాయతీ కార్యదర్శి సంధ్యకు ఇల్లంతకుంట పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వేణు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పరిధిలో దాదాపు లక్ష మంది కార్మికులు జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తే, 210 మంది ఫీల్డ్‌అసిస్టెంట్లు పనిచేస్తున్నారన్నారు. విద్యావంతులై ఉండి కేవలం రూ. 12500 వేతనాలకు పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా వేతనాలు కూడా రాక ఫీల్డ్‌అసిస్టెంట్లు ఆర్థికంగా ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. ప్రభుత్వాలు స్పందించి వేతనాలను విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు పంతం రవి, అజ్జ వేణు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు ఆసరా పెన్షన్ అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనసూర్య

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం బీడీ కార్మికులకు రూ. 4వేల ఆసరా పెన్షన్ హామీని అమలుచేయాలని తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షురాలు కేవీ అనసూర్య అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు కేవీ అనసూర్య, గౌరవ అధ్యక్షుడు కడారి రాములు మాట్లాడారు. పెరిగిన కరువుభత్యం వీడీఏ ప్రకారం వెయ్యి బీడీలకు రూ.261.97 పైసలు బీడీ టేకేదారులు, బీడీ కంపనీల యజమానులు ఇవ్వాలన్నారు. సమావేశంలో తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అజ్జ వేణు, ఉపాధ్యక్షురాలు రేగుల అనిత, సహాయ కార్యదర్శి ఉషకోయల లక్ష్మి, కోశాధికారి సుంకనపెల్లి శాంత, కార్యవర్గ సభ్యులు కోడం ప్రమీల, తేలు సరోజన, ఎంజాల లక్ష్మి, గాజుల రాధ పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షుడి రాజీనామా

ఇల్లంతకుంట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. కాంగ్రెస్‌పార్టీకి అధికారమే లక్ష్యంగా కష్టకాలంలో పనిచేశానని, కొన్ని కారణాలవల్ల పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణలతో పాటు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి పదిర, కొండాపూర్ ఇసుక రీచ్‌లు ప్రారంభించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా - జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశం

సిరిసిల్ల కలెక్టరేట్ ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మానేరు నది పరివాహక ప్రాంతాల్లోని ఎల్లారెడ్డిపేట మండలం పదిర, ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామాల్లోని మంగళవారం నుంచి ఇసుక రీచ్‌లు ప్రారంభించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం ఇసుక రీచ్‌ల ఏర్పాటుపై కలెక్టరేట్‌లో అధికారులతో జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ, పదిర రీచ్ నుంచి ఇసుక రవాణా కోసం అవసరమైన అనుమతులు అందించాలన్నారు. జిల్లాలో మానేరు నది నూతనంగా గుర్తించిన 6 ఇసుక రీచ్‌ల ప్రస్తుత స్థితిగతిపై చర్చించారు. కొండాపూర్ వద్ద ఇసుక కమిటీ సభ్యులు అందించిన నివేదిక ప్రకారం ఒక ఇసుక రీచ్ నుంచి ఇసుక తరలింపునకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పదిర ఇసుక రీచ్ ప్రారంభించిన తర్వాత వెంకటాపూర్ ఇసుక రిచ్ నిలుపుదలకు చర్యలు చేపట్టాలన్నారు. కొండాపూర్, పదిర ఇసుక రీచ్‌ల ప్రారంభించిన తర్వాత మరోసారి సమావేశం నిర్వహించాలని తెలిపారు. వట్టిమల్లో అప్రోచ్ రోడ్ సమస్యపై సంబంధిత తహసీల్దార్ నివేదిక అందించాలని తెలిపారు. మంగళవారం నుంచి కొండాపూర్, పదిర ఇసుకరీచ్ ప్రారంభంకావాలని, దీనికి సంబంధించిన మంజూరు పత్రాలు జారీ చేయాలని సూచించారు. సిరిసిల్ల జిల్లాలో నూతనంగా నిర్మించే ప్రభుత్వ ప్రాజెక్టులు, ఇందిరమ్మ ఇండ్లు, పెండింగ్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి ఎక్కడ ఇసుక కొరత రాకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి, మైనింగ్ అధికారి క్రాంతికుమార్, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, ప్రోగ్రాం అధికారి టీజీఎండీసీ జైపాల్‌రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారి అమరేందర్‌రెడ్డి, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను పొందాలని తహసీల్దార్ సుజాత అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, అగ్రహారం, పోతిరెడ్డిపల్లి, హరిదాస్‌నగర్ గ్రామాల్లో సెర్ప్-ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుజాత మాట్లాడుతూ రైతులు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని అన్నారు. వరి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయకుండా నిర్వాహకులు వేగవంతం చేయాలని సూచించారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సుజాత ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు రాజేందర్, లక్ష్మీ, తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం మల్లేశం, నాయకులు లక్ష్మారెడ్డి, రాములు, బాల్‌రెడ్డి, బుచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : గ్రామాల్లో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించిందని మార్కెట్ కమిటీ చైర్మన్ లకావత్ రాములు నాయక్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు రంగంపేట, వన్‌పల్లి, శాంతినగర్, గర్జనపల్లి, సీతారాం నాయక్ తండా, జవహర్‌లాల్ తండా, లాల్ సింగ్ తండా, బావ్ సింగ్ నాయక్ తండా, భూక్య తండా గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధులు, అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం అమ్మి రైతులు మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్వో ముక్తార్ పాషా, ఏపీఎం నర్సయ్య, ఏఎంసీ వైస్‌చైర్మన్ లక్ష్మణ్, ఏఎంసీ డైరెక్టర్లు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.



హరిదాస్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ సుజాత

● తంగళ్లపల్లి : తంగళ్ళపల్లి మండలం వేణుగోపాల్ పూర్, అంకిరెడ్డిపల్లె, ఓగులాపూర్, రాళ్లపేట, రామన్నపల్లి, బస్వాపూర్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్మన్ వేముల స్వరూప తిరుపతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, డైరెక్టర్లు పొన్నాల పరశురాములు, ఆరెపల్లి బాలు, తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ (గంభీరావుపేట) : ముస్తాబాద్ మండలంలోని 7 గ్రామాల్లో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ముర్రాయిపల్లి, కొండాపూర్, ఆవునూర్, గన్నేవారిపల్లి, సేవాలాల్, తెర్లుమద్ది వెంకట్రావ్‌పల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ రాణి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, పలువురు నాయకులు అధికారులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



నీటిలో హషాం అహ్మద్ మృతదేహం

ధర్మపురి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం గోదావరినదిలో దూకి హషాం అహ్మద్(45) అనేవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మంచిర్యాలజిల్లా మందమర్రి పట్టణానికి చెందిన హషాం అహ్మద్ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతోబాధపడుతుండేవాడని ఆయన పేర్కొన్నారు. ఉదయం రాయపట్నం గోదావరి నదిలో మృతదేహం కనిపించడంతో సమాచారం అందించామన్నారు. మందమర్రిపట్టణానికి చెందిన మహ్మద్అలీ అహ్మద్ అనే వ్యక్తివచ్చి మృతుడు తనకొడుకు హషాంఅహ్మద్ అని గుర్తించాడన్నారు. హషాం అహ్మద్ ఫైనాన్స్ విషయమై రాయపట్నం గోదావరి నదిలోదూకి ఆత్మహత్య చేసుకున్నాడని అతడి తండ్రి ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి బలవన్మరణం

జూలపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు కులాంతర వివాహం చేసుకోవడంతో అప్పటినుంచి మనస్తాపంతో ఉన్న తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఎండి అజ్జర్‌పాష(43)కు ఇద్దరు కూతుళ్ళు పెద్ద కూతురుకు వివాహమైంది. రెండోకూతురు గతనెలలో అదే గ్రామానికి చెందిన యువకుడితో కులాంతర వివాహం చేసుకుంది. అప్పటినుంచి కూతురు తనను మోసం చేసిందని అజ్జర్‌పాష బాధపడుతుండేవాడు. ఈక్రమంలో మనస్తాపంతో ఆదివారం పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకిచేరాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబసభ్యులు వైద్యంకోసం కరీం నగర్‌కు, అనంతరం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.మృతుడిభార్య ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ పేర్కొన్నారు.

గోపాలమిత్రల గోడు పట్టేదెవరికి?

● 25 ఏళ్లుగా వెట్టిచాకిరి ● క్రమబద్ధీకరణకు నోచుకోని వైనం



గేదెకు కృత్రిమ గర్భధారణ చేస్తున్న గోపాలమిత్ర

కథలాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పశువుల ఆరోగ్యం, అధిక పాలనిచ్చే ఆవులు, గేదెల సంతతిని పెంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న గోపాలమిత్రల గోడు వినేవారే కరవయ్యారు. 25 ఏళ్ల నుంచి వెట్టి చాకిరి చేస్తున్న గోపాలమిత్రలు నామమాత్రపు గౌరవ వేతనంతో పల్లెల్లో పనిచేస్తున్నారు. పశు సంవర్ధక శాఖ గత 2000-2001 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద పెంచడానికి శిక్షణ ఇచ్చి గోపాలమిత్రలను నియమించారు. నేటికీ నామమాత్రపు గౌరవ వేతనంతోనే పని చేస్తుండగా రిటైర్‌మెంట్ వయసు వచ్చినా రెగ్యులరైజేషన్‌కు నోచుకోవడం లేదు.

ప్రభుత్వాలు మారినా నెరవేరని హామీలు

అధిక పాల దిగుబడులను ఇచ్చే ముర్రా జాతి గేదెలు, జెర్సీ, పుంగనూరు, సాయివాల్, ఒంగోలు గిత్తల సంతతిని పెంచడానికి కృత్రిమ గర్భధారణ చేయడంలో కీలక భూమిక పోషించడానికి గోపాలమిత్రలను నియమించారు. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 150 మంది గోపాలమిత్రలు పనిచేస్తున్నారు. పల్లెల్లో తిరుగుతూ రైతులను చైతన్యవంతం చేసి పశువులకు కృత్రిమ గర్భధారణ చేసి సంతతిని పెంచడంతో పాటు వైద్య సిబ్బందికి వివిధ రకాల పనుల్లో సహకరిస్తున్నారు. వ్యాక్సినేషన్, డీవార్మింగ్ వంటి కార్యక్రమాల్లో కూడా గోపాలమిత్రల సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రతీ నెలా 120 కృత్రిమ గర్భధారణ కేసులు విధిగా చేయాల్సి ఉంటుంది. ఒక్కో స్ట్రాకు రూ.40లు చెల్లించి లిక్విడ్ నైట్రోజన్‌తో నింపిన కంటైనర్‌లో మైనస్ 0.90 డిగ్రీల ఉష్ణోగ్రతలో భద్రపరచాల్సి ఉంటుంది. పశువులు ఎదకొచ్చిన సమయాన్ని గుర్తించి మేలు రకం జాతి వీర్యాన్ని రైతు ముంగిటే కృత్రిమ గర్భధారణ చేస్తుంటారు. రైతులు ఇచ్చే పారితోషికంపైనే జీవనం కొనసాగించాల్సిన దుస్థితి ఉంది. గతంలో పాలకులు రెగ్యులరైజ్ చేసి ఆఫీస్ సబార్డినేట్లుగా నియమిస్తామని ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలి పోయాయని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. 25 ఏళ్ల అనుభవంతో పని చేస్తున్న గోపాలమిత్రలను పశు వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో విద్యార్హతల ఆధారంగా నియమి స్తారని ఆశతో ఎదురుచూశారు. ఇటీవల శాఖతో సంబంధం లేని వారిని ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించారని గోపాలమిత్రలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



కథలాపూర్ పశువైద్య కేంద్రం

ఆశలు ఆవిరి చేశారు.. చెన్నవేని దశరథం, ఉమ్మడి జిల్లా గోపాలమిత్ర సంఘం గౌరవాధ్యక్షుడు



గోపాలమిత్రగా 25 ఏళ్లుగా పనిచేస్తున్నాం. పాలకులు తమను రెగ్యులరైజ్ చేస్తారని నమ్మి పల్లెల్లో తిరిగి పశు సంపద పెంపు కోసం శ్రమించాం. గ్రామాల్లో శిబిరాలు, డీవార్మింగ్, వ్యాక్సినేషన్, కృత్రిమ గర్భధారణ వంటి కీలక పనులు నిర్వహిస్తున్నాం. తెలంగాణ ఏర్పడ్డాక తమ జీవితాలు మారిపోతాయని ఆశించినా భంగపాటు తప్పలేదు. ఇప్పటికైనా ఖాళీగా ఉన్న పశువైద్య కేంద్రాల్లో విద్యార్హతల ఆధారంగా ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించి గోపాలమిత్ర కుటుంబాలను ఆదుకోవాలి.

తామర పురుగు నివారణతోనే మామిడి దిగుబడులు

● తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సీజన్‌లో మామిడిలో తామర పురుగు ఉధృతిని నివారిస్తేనే అధిక దిగుబడులు సాధ్యం అవుతాయని కొండాలక్ష్మణ్ బాపూజీ తెలంగాణ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్‌లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల జిల్లాలోని వివిధగ్రామాల్లో గల మామిడి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం మామిడికాయ వృద్ధిచెంది, టెంకె గట్టిపడే దశలో ఉందన్నారు. పలుతోటలలో తామర పురుగు ఉధృతిని గమనించామని, సాధారణంగా మామిడి తోటలో తేనె మంచుపురుగు పూత, పిందదశలో నష్టాన్ని కలుగజేస్తుందని, అయితే తేనె మంచు పురుగు అదుపులో ఉన్నప్పటికీ తామర పురుగు ప్రభావం వల్ల పిందెలు రాలడం, మంగు ఏర్పడి కాయను పనిరాకుండా చేస్తుందన్నారు. నివారణ చర్యగా పురుగు ఉధృతిని బట్టి,ముందుగా వేప నూనె 3మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని, తర్వాత ఫిప్రోనిల్ 80శాతం డబ్ల్యూజి0.2గ్రా,లేదా స్పైనోసాడ్ 45శాతం ఎస్‌సి 0.3మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. సింథటిక్ పైరిత్రాయిడ్ కీటక నాశనినులను ఈ సమయంలో వాడరాదని సూచించారు. ఆయనవెంట కృషివిజ్ఞాన కేంద్రం రామగిరిఖిల్లా శాస్త్రవేత్త డా.వెంకన్న, ఫామ్‌మేనేజర్ బండారి నరేష్, ఫల పరిశోధన స్థానం సంగారెడ్డి శాస్త్రవేత్త సతీష్, ఉద్యాన అధికారి మహేష్‌తో పాటు మామిడి రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎక్సైజ్ దాడులు

గంభీరావుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం ముచ్చర్ల, లింగన్నపేట తండాల్లో సోమవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. నాటుసారా తయారుచేస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో 300 లీటర్ల బెల్లం పానకం, 12 లీటర్ల నాటుసారా లభ్యం అయ్యింది. బెల్లం పానకం, నాటుసారాను స్వాధీనం చేసుకుని బాధ్యులైన ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా గుడంబా తయారుచేసే ఇద్దరు అనుమానితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ ఎస్ఐ శైలజ, సిబ్బంది కిషోర్, మల్లేశ్వర్, రాకేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

మహిళను వేధించి హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహిళను లైంగికంగా వేధించి ఒంటిపై కిరోసిన్ పోసి నిప్పంటించి హత్యకు పాల్పడిన వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు రూ.1.02 లక్షల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓ వివాహితను అదే గ్రామానికి చెందిన ఇల్లంతకుంట శ్రీధర్ (28) అనే యువకుడు తరచూ లైంగికంగా వేధిస్తూ ఉండేవాడు. 2019 ఏప్రిల్14న వివాహిత ఒంటరిగా ఇంటి వద్ద ఉన్న సమయంలో శ్రీధర్ ఇంట్లోకి ప్రవేశించి లైంగిక కోరిక తీర్చమని వేధించడంతో పాటు చంపుతానని బెదిరించాడు. మహిళ తిరగబడడంతో ఒంటిపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. తీవ్రంగా గాయపడిన మహిళ రెండు రోజుల అనంతరం చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి సీఐలు నాగేందర్, కిషోర్‌లు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటి అధికారులు సాగర్, కిరణ్, రాజులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లికార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి శ్రీధర్‌కు జీవిత ఖైదు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

చికిత్స పొందుతూ డిగ్రీ విద్యార్థి మృతి



అవేజ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గతనెల 30న రోడ్డు ప్రమాదంలోగాయపడిన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని డిగ్రీ విద్యార్థి షేక్ అవేజ్(20) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతిచెందాడని పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు,కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని జైబుల్-సమ్మద్ దంపతుల ఒక్కాగానొక్క కొడుకు అవేజ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. రంజాన్ పండుగ నేపథ్యంలో గతనెల 28న స్వగ్రామానికి వచ్చాడు. అదేనెల 30న సమీప బంధువైన యువకుడు అఫ్రోజ్‌తో కలిసి స్కూటీపై నూతన దుస్తులు కొనుగోలు చేసేందుకు సిరిసిల్ల బయలుదేరారు. మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న ఆటో అతి వేగంగా స్కూటీని ఢీకొట్టింది. దాంతో విద్యార్థులు అవేజ్, అఫ్రోజ్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. వారం రోజులుగా చికిత్స పొందుతున్న అవేజ్ పరిస్థితి చివరికీ మృతిచెందాడు. మృతదేహం ఇల్లు చేరడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువుల రోధనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



రమేష్ (ఫైల్)

వెల్గటూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన జక్కులరమేష్(41) సోమవారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్సై ఉమసాగర్ తెలిపిన వివరాల ప్రకారం రమేష్ కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈనెల 4న క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబీకులు జగిత్యాల ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుని భార్య జక్కుల వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వీడని 'విదేశీ బంగారం' చిక్కుముడి

● గల్ఫ్ పారిపోయిన నిందితుడు?

వేములవాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సౌదీ అరేబియా నుంచి తీసుకు వస్తుండగా గమ్యస్థానం చేరకముందే మార్గమధ్యలోనే సినీ ఫక్కీలో మాయమైన విదేశీ బంగారం కేసు చిక్కుముడి వీడడం లేదు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన రుద్ర రాంప్రసాద్ తన సమీప బంధువు సహకారంతో వేములవాడకు చెందిన కాల్వ వెంకటేష్ అనే వ్యక్తి ద్వారా బంగారం తెప్పించుకోవడం కోసం డబ్బులు పంపించారు. ఈ మేరకు చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన బీరయ్య, అనిల్ పెద్దమొత్తంలో బంగారంతో హైదరాబాదులోని ఎయిర్‌పోర్టులోని దిగిన అనంతరం సమీప బంధువైన ఎనగంటి గ్రామానికి చెందిన ఏనుగుల నాగరాజును కలవగా, సదరు బంగారాన్ని నాగరాజు తీసుకుని కనిపించకుండా పోవడంతో రాంప్రసాద్ వేములవాడ పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు బంగారం స్వాహా చేశారన్న నేరంపై తొంటి బీరయ్య, గడ్డం అనిల్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఏ1 నిందితుడుగా ఉన్న కాల్వ వెంకటేష్ సౌదీలో ఇప్పటికే ఉండగా, ఎ4గా ఉన్న నిందితుడు ఏనుగుల నాగరాజు చాకచక్యంగా పోలీసుల కన్నుకప్పి గల్ఫ్ పారిపోయినట్లు తెలిసింది. మాయమైన బంగారం ఆచూకీ కనుగొనేందుకు ఇద్దరు ఎస్ఐలతో పాటు నలుగురు కానిస్టేబుళ్లతో రెండు బృందాలను పోలీసు అధికారులు ఏర్పాటు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద స్వాధీనం చేసుకున్న బంగారాన్ని నాగరాజు ఏం చేశాడనే విషయంపై ఇంకా స్పష్టత రాకపోవడం పోలీసు అధికారులను కలవరపరుస్తోంది. నిందితుడు నాగరాజు వాడిన సెల్‌ఫోన్‌కు సంబంధించిన డేటాను సేకరించిన పోలీసులు అందులో లభించిన సమాచారం ఆధారంగా బంగారం రవాణా వ్యవహారంలో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. కేసు విచారణ తొలి దశలోనే తమ కళ్లుగప్పి చాకచక్యంగా పారిపోయిన నాగరాజును తిరిగి రప్పించేందుకు పోలీసులు లుకౌట్ నోటీస్ జారీచేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా తాను సౌదీ నుంచి 400 గ్రాముల బంగారం తెప్పించుకునేందుకు 35 లక్షల రూపాయలను చెల్లించినట్లు ఫిర్యాదుదారు రవీందర్ చెబుతుండడంపై కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 400గ్రాములు బంగారం కోసం 35 లక్షల రూపాయలు చెల్లించి విదేశాల నుంచి తెప్పించుకోవాల్సిన అవసరం ఏముంది అనే ప్రశ్నలు కూడా ఉత్తమవుతున్నాయి. పెద్ద మొత్తంలో బంగారం అక్రమ రవాణా జరిగి ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సౌదీ నుంచి బంగారం తీసుకువచ్చిన బీరయ్య, అనిల్ సైతం తాము చాలా పెద్దమొత్తంలో బంగారం తీసుకువచ్చినట్లు సన్నిహితుల వద్ద చెప్పినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో అసలు ఈ బంగారం రవాణా వ్యవహారం ఏ స్థాయిలో సాగి ఉంటుందనేది తేలాల్సి ఉంది.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి బలవన్మరణం

కొడిమ్యాల, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన రాచర్ల ప్రకాష్(54) ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. ప్రకాష్ వద్ద పలువురు అప్పుగా తీసుకొని తిరిగి ఇవ్వకపోవటంతో ఇబ్బందుల పాలయ్యాడు. ఇంటి యజమాని తరుచుగా ఇంటిని ఖాళీ చేయాలని గొడవ పెట్టాడన్నారు. ఇంటి యజమానితో ఆదివారం రాత్రి గొడవ జరగటంతో అద్దెకు ఉంటున్న ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య రాధ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

● కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వేములవాడకు తరలివచ్చిన భక్తులు సోమవారం తెల్లవారు జామునే ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిరాజరాజేశ్వర స్వామి వారలను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించారు. ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. బద్దిపోచమ్మ అమ్మవారికి బోనం తీసి డప్పుచప్పుళ్ల, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి పిల్లపాపలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు.

ఈవో వినోద్‌రెడ్డికి ఆలయ ఉద్యోగుల సన్మానం..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీరామనవమి నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించిన సందర్భంగా ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈవో వినోద్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, అశోక్‌కుమార్, జయకుమారి, సూపరింటెండెంట్‌లు వరి నర్సయ్య, శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్‌లు మమత, పురాణం వంశీ, బొడుసు మహేష్, లతదేవి, ప్రధాన అర్చకులు మామిడిపల్లి రాములు, చంద్రగిరి శరత్, గోపన్నగారి రఘు, గౌతమ్, కూరగాయాల శ్రీనివాస్, సుశీల్ తదితరులు ఉన్నారు.



ఈవో వినోద్‌రెడ్డిని సన్మానిస్తున్న భక్తులు



బద్దిపోచమ్మ వద్దకు బోనాలతో వెళుతున్న భక్తులు

గుండెపోటుతో దుబాయిలో అయిలాపూర్ వాసి మృతి



శ్రీనివాస్ గౌడ్ (ఫైల్)

కోరుట్లరూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దుబాయిలో గుండెపోటుతో సోమవారం కోరుట్లరూరల్ మండలం అయిలాపూర్ గ్రామానికిచెందిన గాజర్ల శ్రీనివాస్‌గౌడ్(55) మృతిచెం దాడు. ఐదుసంవత్సరాల క్రితం శ్రీనివాస్‌గౌడ్ ఉపాధి నిమిత్తం అప్పుచేసి గల్ఫ్‌దేశానికి వెళ్లాడు. సోమవారం ఉదయం గుండెపోటుతో శ్రీనివాస్‌గౌడ్ తను ఉంటున్న రూంలో మృతిచెందినట్లు అతడి స్నేహితులు బంధువులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. శ్రీనివాస్‌గౌడ్‌కు భార్య జల, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. శ్రీనివాస్‌గౌడ్ మృతదేహం త్వరగా ఇంటికి చేరేలా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

స్థల పరిశీలనలోనే కేజీబీవీ

● గన్నేరువరంలో స్కూల్ ఏర్పాటయ్యేనా?

● ఈ సంవత్సరమైనా ప్రారంభించాలని కోరుతున్న ప్రజలు

గన్నేరువరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలానికి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల మంజూరై ఏడాదిదాటినా పాఠశాల ఏర్పాటుపై స్పష్టత కొరవడింది. ఏడాది క్రితం మండల కేంద్రంలో కేజీబీవీ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అధికారులు, నాయకులతో కలిసి ప్రభుత్వ స్థలాలను, ప్రైవేట్ బిల్డింగ్‌లను పరిశీలించారు. అనుకూలంగా ఎక్కడా భవనం దొరకకపోవడంతో తిమ్మాపూర్‌లోనే కేజీబీవీని ప్రస్తుతానికి కొనసాగిస్తున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసే కేజీబీవీ పాఠశాలలో ఉద్యోగాల కోసం ఇటీవల అవుట్ సోర్సింగ్ ద్వారా అటెండర్, వాచ్‌ఉమెన్, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, స్వీపర్ వంటి మొత్తం ఏడుఉద్యోగాలకు దరఖాస్తులను తీసుకున్నారు. దీంతో మండల కేంద్రంలో త్వరలోనే కేజీబీవీ ఏర్పాటు అవుతుందని మండల ప్రజలు భావించారు. ఈ విద్యాసంవత్సరం ముగుస్తున్నందున రాబోయే 2025-26విద్యా సంవత్సరానికైనా కేజీబీవీ పాఠశాలను మండలకేంద్రంలో ఏర్పాటుచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంఈవో కెరామయ్యను ఆంధ్రజ్యోతి సంప్రదించగా కేజీబీవీ పాఠశాలను మండలంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలు అనుకూలంగా లేవు. దీంతో తిమ్మాపూర్‌లోనే కొనసాగిస్తున్నట్లు తెలిపారు.



గన్నేరువరంలో కేజీబీవీ కోసం ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ (ఫైల్)

విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా మండల కేంద్రంలో పాఠశాలకు అనువైన ప్రభుత్వ స్థలాన్ని సేకరించి నివేదిక ఇవ్వవలసిందిగా తహసీల్దారును ఆదేశించినట్లు తెలిపారు. దీంతో తహసీల్దారు ఇప్ప నరేందర్‌ను ఆంధ్రజ్యోతి సంప్రదించగా మండల కేంద్రంలోని మైలారం రోడ్డుకు ఏనె ప్రాంతంలో 5ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేజీబీవీ పాఠశాల కోసం సేకరించామని, విద్యాశాఖకు ఈ భూమిని అప్పగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

రుద్రంగిలో విషాదం..

- ఫుడ్ పాయిజన్‌తో తల్లీ, కొడుకు మృతి
- మృతురాలి ఇంటి ఎదుట బంధువుల ఆందోళన



పుష్పలత, నిహాల్ తేజ్ (ఫైల్)

రుద్రంగి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఫుడ్‌పాయిజన్‌తో తల్లీకొడుకులు మృతి చెందడంతో మండల కేంద్రంలో విషాదం నెలకొంది. మండలకేంద్రానికి చెందిన కాదాసు పుష్పలత(35), ఆమె కూమారుడు నిహాల్ తేజ్(6) ఈనెల4న రాత్రి చపాతీలు తిన్నారు. అదేరాత్రి ముందుగా నిహాల్‌కు, గంటవ్యవధిలోనే పుష్పలతకు వాంతులు కాగాస్థానికంగా చికిత్స అందించారు. మరుసటి రోజు ఉదయం నిహాల్‌కు ఫిట్స్ రావడంతో చికిత్స కోసం తల్లీకొడుకులను కోరుట్లలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో జగిత్యాల, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పుష్పలత ఆదివారం రాత్రి మృతిచెందింది. మెరుగైన వైద్య కోసం బాలుడు నిహాల్ తేజ్‌ను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం తెల్లవారుజామున నిహాల్ తేజ్ మృతిచెందాడు. మృతురాలి భర్త జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. తన చెల్లె, మేనల్లుడి మృతిపై అనుమానం ఉందంటూ పుష్పలత అన్న పాలెం శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రుద్రంగి ఎస్ఐ ఎస్ అశోక్ తెలిపారు. కాగా, తల్లీకుమారుడి మృతిపై గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా, రుద్రంగి మండల కేంద్రంలో తల్లీకొడుకులు అనుమానాస్పదంగా మృతిచెందారని మృతురాలు అత్తమామ ఇంటి వద్ద పుష్పలత బంధువులు ఆందోళనకు దిగారు. పుష్పలత, నిహాల్‌తేజ్ ఫుడ్‌పాయిజన్ వల్ల చనిపోలేదని ఆందోళన చేపట్టగా, ఆక్కడికి చెరుకున్న సీఐ వేంకటేశ్వర్లు, ఎస్ఐ సిరిసిల్లఅశోక్ మృతురాలి బంధువులతో మాట్లాడి న్యాయం చేస్తామాని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని దర్శవాలీ గుట్ట ప్రాంతంలోని పేకాట స్థావరంపై ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఖచ్చితమైన సమాచారంతో దాడి చేయడంతో గమనించిన ఐదుగురు పేకాటరాయుళ్లు పారిపోయారు. మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.4200 నగదు, ఒక సెల్‌ఫోను, బైక్‌ను స్వాధీనపర్చుకున్నామని తెలిపారు. పారిపోయిన ఐదుగురు వ్యక్తులపై ఆరా తీస్తున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి చిరు ధాన్యాలు



- పాత సంప్రదాయం తిరిగి వస్తోంది
- తృణధాన్యాలపై పెరుగుతున్న ఆసక్తి

చొప్పదండి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పాత రోజుల్లో వరి(బియ్యం)కి బదులుగా జొన్నలు, రాగులు, కొర్రలు, సజ్జలు, వరిగెలు, గుమ్మడి గింజలను ఆహారంగా తీసుకునేవారు. వర్షాభావ పరిస్థితుల్లో కూడా ఇవి బాగా పండేవి. పండుగల సందర్భంలోనే ఇళ్లలో బియ్యంతో అన్నాన్ని వండుకునే వారు. జొన్నరొట్టె వాడకం బాగా ఉండేది. జనాభా పెరుగుదల పాటు సేద్యం పెరగడంతో వరిధాన్యం ఉత్పత్తి పెరిగింది. పాత రుచులైన రాగులు, సజ్జలు, జొన్నల వినియోగం తగ్గి బియ్యంతో చేసిన అన్నం వినియోగం పెరిగింది. ఫాస్ట్‌గా ఫాస్ట్ ఫుడ్ కల్చర్ వచ్చింది. దీనితో ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నది. చిన్న వయస్సులోనే బీపీ, షుగర్ రావడం ప్రారంభమైంది. దీంతో ప్రజలు పాత రుచుల వైపు మొగ్గు చూపుతున్నారు. రాగి సంకటి, జొన్నరొట్టె, సజ్జ రొట్టె, కొర్రలు, అరిగెలు, అండుకొర్రల వినియోగం బాగా పెరిగిపోయింది.

మారుతున్న జీవన విధానం

ఎప్పుడైతే తృణధాన్యాల వినియోగం తగ్గిందో, అన్నం వాడకం పెరిగిందో అప్పటినుంచి మనిషికి రోగాలు పెరిగిపోయాయి. తృణ ధాన్యాలు వాడిన రోజుల్లో మనిషి కాయకష్టం చేసేవారు. అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేవాడు. మనిషి కూర్చున్న చోటునుంచి లేవకుండా పని చేసే వెసులుబాటు రాగా శారీరక శ్రమ తగ్గి రోగాలు పుట్టుకొస్తున్నాయి.

పాశ్చాత్య దేశాల అలవాట్లను ఆకళింపు చేసుకొని ఫాస్ట్‌ఫుడ్ మోజులో పడి మన ప్రాచీన పద్ధతులను అటుకెక్కించిన సందర్భం నుంచి తిరిగి వేగంగా జీవన విధానం మారుతోంది. ప్రస్తుతం కొర్రలు, జొన్న గడక, రాగి సంకటి, పచ్చ, తెల్లజొన్న రొట్టెలు, సజ్జ రొట్టెల వినియోగం బాగా పెరిగింది. ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ నుంచి చాలామంది బయటకు వస్తూ జీవన విధానాన్ని మార్చుకుంటు న్నారు. రాగులు, జొన్నలు తిన్న రోజుల్లో మధుమేహం, బీపీలు ఉండేవి కావు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం 2023-24సంవత్సరాన్ని ఇయర్ ఆఫ్ మిల్లెట్స్‌గా ప్రకటించింది. మిల్లెట్ సాగుకు పలు ప్రోత్సాహకాలను ప్రకటించి సాగును పెంచేందుకు కృషిచేస్తోంది. ప్రస్తుతం టిఫిన్ సెంటర్లలోనూ రాగి దోశలు, జావా, మిల్లెట్స్ ఇడ్లీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.




రాగులు..



రాగులను ఆహారంగా తీసుకోవడం వల్ల శరీరంలో ఉన్న అదనపు కొవ్వు కరుగుతుంది. పిల్లల ఎదుగుదలకు, వయస్సు మళ్లిన వారికి, మహిళలకు ఎముకల పుష్టికి ఉపయోగ పడుతుంది. మధుమేహ రోగులలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది.

జొన్నలు..



పేదవాడి ఆహారంగా జొన్నలు పేరొందాయి. జొన్నపిండితో చేసిన ఆహారపదార్థాలను తింటే తేలికగా జీర్ణమవుతాయి. జబ్బుబారిన పడినవారు జొన్నలు ఆహారం తీసుకుంటే త్వరగా కోలుకుంటారు.

కొర్రలు..



ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా మంది ఇష్టపడే ఆహారపంటలలో కొర్రలకు ప్రత్యేక స్థానం ఉంది. వీటిలో పోషకాలు, ప్రోటీన్లు ఉంటాయి. గుండెకు రక్తప్రసరణను సక్ర మంగా జరిగేలా చేస్తాయి. శరీరంలో వ్యర్థాల ను బయటకు పంపిస్తాయి. కొర్రల ఆహారం ఎంత తిన్నా బరువు పెరుగుదల ఉండదు.

కాంగ్రెస్ ముసుగులో బీఆర్ఎస్ నేతలు



రేచపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

సారంగాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వపాలనలో కాంగ్రెస్‌కార్యకర్తలపై అరాచకాలకు పాల్పడిన బీఆర్ఎస్ నేతలు రాజ్యాధికారం కోసం మరోమారు కాంగ్రెస్ ముసుగులో అరాచకాలకు పాల్పడుతున్నారని మాజీమంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం జగిత్యాలజిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల ఎమ్మెల్యే మాకునూరి డాక్టరు సంజయ్ కుమార్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శనాస్త్రాలు సంధించారు. రాజ్యాధికారం కోసం కాంగ్రెస్ ముసుగులో వస్తున్న బీఆర్ఎస్ నేతలు బిహార్ కూలీల మాదిరిగా కమీషన్ తీసుకొని వచ్చి వెళ్తుంటారని విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ కోసం, ప్రజల సంక్షేమం కోసంనిరంతరం పోరాడుతానని జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ తనకు పదవిలేదని అధైర్యపడొద్దని ఆయన సూచించారు. తన తుదిశ్వాస వరకు ప్రజలసంక్షేమం కోసం ప్రజాక్షేత్రంలోనే ఉంటానని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు హైదరాబాద్ స్కూల్ఆఫ్ బ్యాంకింగ్అండ్‌ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ ద్వారా బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో ఉచితశిక్షణ అందించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు మంగళవారంలోగా www.tgbcstudycircle.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల12న ఉమ్మడిజిల్లా కేంద్రంలో ఆన్‌లైన్ స్ర్కీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చినమార్కుల ఆధారంగా 30మందిని ఎంపిక చేయనున్నట్లు, శిక్షణ అనంతరం ప్రైవేట్ బ్యాంకుల్లో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 0878-2268686నంబరులో సంప్రదించాలని సూచించారు.

సిరిసిల్ల నేతన్నల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- కేంద్రహోంశాఖ సహాయ మంత్రి స్పందించాలి
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నేతన్నల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ప్రభుత్వం తయారుచేయించే చీరలకు సంబంధించి మరమగ్గాల, అనుబంధ రంగాలైన వార్పిన్, వైపని కార్మికులకు మెరుగైన వేతనాలు వచ్చే విధంగా ప్రభుత్వమే కూలి నిర్ణయించి ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పందించాలన్నారు. సిరిసిల్లలో మరమగ్గాలతోపాటు అనుబంధ రంగాల కార్మికుల కూలి నిర్ణయించి, సమస్యలను పరిష్కరించాలంటూ సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధికసమ్మె 7వ రోజుకు చేరుకుంది. అయినా రాష్ట్ర ప్రభుత్వంతో పాటు జిల్లా అధికారులు స్పందించకపోవడంతో సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో 24గంటల దీక్షలను చేపట్టారు. ముఖ్య అతిథిగా సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు హాజరై దీక్షలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిరిసిల్లలో నేతన్నలు వారం రోజులుగా నిరవధిక సమ్మె చేసున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. నేతన్నలు చేస్తున్న సమ్మె పోరాటానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యల నేపథ్యంలో ఉపాధి కల్పించి మెరుగైన వేతనాలు అందించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు, పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బతుకమ్మ చీరల స్థానంలో మహిళాస్వశక్తి సంఘాల మహిళలకు సంవత్సరానికి రెండు చీరలను అందించేందుకు ఆర్డర్‌లను ఇచ్చిందన్నారు. యాజమానులకు కూలి నిర్ణయించి కార్మికులకు కూలిని నిర్ణయించకుండా అన్యాయం చేయడం సరైందికాదన్నారు.

ప్రభుత్వం అధికారంలోకి రాకముందు సిరిసిల్లలో నేతన్నలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పి 15 నెలలు అవుతున్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వంతో పాటు చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పందించి సిరిసిల్లలో నేతనల సమస్యలతో పాటు వారి డిమాండ్‌లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. స్థానిక కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు సిరిసిల్లలో నేతన్న సమస్యలు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. బండి సంజయ్ మత విద్వేషాలు రెచ్చగొట్టడమే తప్ప కార్మికుల సమస్యలు పట్టించుకోరా అని అన్నారు. ఇప్పటికైనా బండి సంజయ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వంతో పాటు ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో మాట్లాడి వస్త్రపరిశ్రమ అభివృద్ధితో పాటు నేతన్నల ఉపాధి సంక్షేమ కోసం పనిచేయాలని కోరారు.

దీక్షకు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు అరుకాల రమేష్‌లతోపాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ దీక్షల్లో మూషం రమేష్ కోడం రమణ, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, నక్క దేవదాస్, ఎలిగేటి శ్రీనివాస్, గుండు రమేష్, బూట్ల వెంకటేశ్వర్లు, అవధూత హరిదాస్, బాస శ్రీధర్, మేకల బాలరాజు, కస్తూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఫీజు బకాయిల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్రఅధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎంవద్ద విద్యాశాఖ ఉన్నా ఫీజు బకాయిల విడుదల పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడవద్దన్నారు. యూనివర్సిటీల భూములను అమ్మాలని చూస్తే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేపడితే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష దాడులు చేస్తామన్నారు ఉస్మానియా యూనివర్సిటీలో అత్యవసర ఆంక్షల ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. వేసవిలో ప్రైవేటు విద్యాసంస్థలు ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో జిల్లాకార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో జెమ్ 2025 వర్క్‌షాప్‌నకు సన్నాహాలు

- బాలికలకు మెడికల్ చెకప్ ప్రక్రియ షురూ

జ్యోతినగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో యేటా నిర్వహిస్తున్న బాలికా సాధికారతా మిషన్(జెమ్) వర్క్‌షాప్ ఈ ఏడాది నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం జెమ్2025 వర్క్‌షాప్‌లో పాల్గొనే 120 మంది బాలికల ఎంపికకోసం మెడికల్ చెకప్ నిర్వహించారు. నాలుగు మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన194 మంది బాలికలకు(8వ తరగతి) ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈనెలలో ప్రారంభమయ్యే జెమ్ 2025 వర్క్‌షాప్ 28 రోజులపాటు కొనసాగుతుంది. బాలికలను చదువుతోపాటు వివిధ రంగాలలో ప్రోత్సహించే ఉద్దేశంతో ఎన్టీపీసీ యాజమాన్యం 120 మంది పేద విద్యార్థినులకు జెమ్ వర్క్‌షాప్ ద్వారా శిక్షణనిస్తుంది. 28 రోజులపాటు నిర్వహించే వర్క్‌షాప్‌లో ఇంగ్లీషు, హిందీ వ్యాకరణం, కంప్యూటర్ లిటరసీ, మ్యాథమెటిక్స్, సైన్స్‌తోపాటు, స్కిల్ డెవలప్‌మెంట్, యోగా, డ్యాన్స్, కరాటే, డ్రాయింగ్‌లో శిక్షణ ఇస్తారు. గర్ల్స్ ఎంపవర్‌మెంట్ మిషన్ కార్యక్రమం 2019 నుంచి రామగుండం ఎన్టీపీసీలో యేటా నిర్వహిస్తోంది.



విద్యార్థినికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

జిల్లెల్ల యువకుడికి ఉత్తమ అవార్డు

- రైతు సమ్మేళనంలో గవర్నర్ చేతుల మీదుగా జ్ఞాపిక అందజేత



అవార్డును అందుకుంటున్న ప్రవీణ్

తంగళ్లపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో నిర్వహించిన ప్రకృతి, సేంద్రియ రైతు సమ్మేళనంలో తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన యువ ఇన్నోవేటర్ కొడుముంజ ప్రవీణ్ ఉత్తమ ఇన్నోవేటివ్ అవార్డును గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా అందుకున్నారు. ఈనెల 4న హైదరాబాద్‌లోని ఏకలవ్య గ్రామీణవికాస్ ఫౌండేషన్, పల్లెసృజన ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సమ్మేళనంలో ఉత్తమ ఇన్నోవేటర్‌గా ప్రశంసపత్రంతోపాటు జ్ఞాపికను అందుకున్నారు. మల్బతోటలో కొమ్మలు కత్తిరించి, మూటకట్టే పరికరాన్ని కొడుముంజ ప్రవీణ్ రూపొందించి పలువురి మన్ననలు పొందాడు. రైతు సమ్మేళనంలో తాను తయారుచేసిన యంత్రాన్ని ప్రదర్శించగా గవర్నర్ పరిశీలించి అభినందించినట్లు ప్రవీణ్‌తెలిపారు. గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని జ్ఞాపికను అందుకోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు అభినందించారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గత నెల 31న జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ సోమవారం రాత్రి తెలిపారు. మండలంలోని బుగ్గరాజేశ్వరతండాకు చెందిన ధరావత్ రమేశ్, అతని అన్న కొడుకు అజ్మీరా రవీందర్‌లు కలిసి తమ ద్విచక్రవాహనంపై మండల కేంద్రం నుంచి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో స్థానిక సాయిబాబా కమాన్ వద్ద కామారెడ్డి- సిరిసిల్ల వైపుకు వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంతో అతి వేగంగా ఢీకొట్టినట్లు చెప్పారు. ప్రమాదంలో రమేశ్, రవీందర్‌లు తీవ్ర గాయాలపాలయ్యారని పేర్కొన్నారు. బాధితుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

జాతీయస్థాయి హ్యాకథాన్‌లో జ్యోతిష్మతి విద్యార్థులకు ప్రథమ బహుమతి



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీఅండ్‌సైన్స్ కళాశాల విద్యార్థులు హైదారబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో ప్రథమ బహుమతి పొందినట్లు విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. ఆదివారం హైదారాబాద్‌లో ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీఅండ్‌సైన్స్, సీహెచ్‌వోఆర్‌టి సంయుక్తంగా నిర్వహించిన హ్యాకథాన్‌లో 92జట్లతో పోటీపడిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పంట వ్యాధులను గుర్తించడానికి, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి ప్రాజెక్ట్ ఆల్ క్రాప్ కేర్ అనే ఏఐ ఆధారిత పరిష్కారాన్ని విద్యార్థులు అజిత్(సీఎస్ఈ-ఏ)-నాలుగవ సంవత్సరం, అక్షిత్(సీఎస్‌యం ఏ)- 4వ సంవత్సరం, రమేష్ (సీఎస్ఈ-డీ) -4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకలిసి రూపొందించిన అత్యుత్తమ ప్రదర్శనకుగాను రూ.10వేలనగదు బహుమతి, ప్రశంసాపత్రంతోపాటు ఈవెంట్ వారు అందించిన టీ-షర్టులు గెలుపొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఇది బండారు బాట వేస్తుందన్నారు.

గ్రామ పంచాయతీలకు భవనాలు లేక ఇక్కట్లు

- అసంపూర్తిగా భవన నిర్మాణాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

మంథని రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు పక్కా



అసంపూర్తి నిర్మాణంలో గాజులపల్లి పంచాయతీ భవనం

భవనాలు లేక పోవడంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులకు గురువుతున్నారు. భవన నిర్మాణాలను ప్రారంభించినా పనులు పూర్తి కాకపోవడంతో అసంపూర్తిగానే నిలిచిపోయాయి. మండ లంలోని 34 గ్రామ పంచాయతీల్లో 11 గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె ఇండ్లు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలు, గోపాల మిత్ర భవనాల్లో కొనసాగిస్తున్నారు. మండలంలోని లక్కేపూర్, సిరిపురం, ఆరెంద, భట్టుపల్లి, బెస్తపల్లి, బిట్టుపల్లి, గద్దలపల్లి, గాజులపల్లి, గుమ్నూనూరు, గుంజపడుగు, కాకర్లపల్లి, సూరయ్యపల్లి, వెంకటాపూర్ గ్రామ పంచాయతీలకు భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఉపాధిహామీ పథకంలో కొత్త భవనాలు మంజూరయ్యాయి. కొన్ని భవనాలు 2016-17లో మంజూరు కాగా, మరి కొన్ని 2023లో మంజూరయ్యాయి. అయితే నిదులు రాకపోవడంతో భవన నిర్మాణాల సంబంధిత కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలి పెట్టారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యక్రమాలను కొన్ని చోట్ల ప్రైవేట్ ఇండ్లలో నిర్వ హిస్తుండగా అధికారులకు అద్దె భారంపడుతోంది. మరికొన్ని చోట్ల ప్రభుత్వానికి సంబంధించిన ఇతర భవనాల్లో నిర్వహిస్తుండగా సంబంధిత శాఖ వారికి ఇబ్బందిగా ఏర్పడుతుంది. అధికారులు స్పందించి భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అద్దె ఇంట్లో కొనసాగుతున్న సూరయ్యపల్లి కార్యాలయం

గ్రామ పంచాయతీ భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి

కారెంగుల సుధాకర్, మాజీ సర్పంచ్ గాజులపల్లి.



గ్రామంలో ఉన్న పాత భవనాన్ని తొలగించి కొత్త భవన నిర్మాణాన్ని ప్రారంభించాం. అది పూర్తి కాలేదు. భవనం స్లాబ్ వరకు మాత్రమే నిర్మాణం అయింది. గ్రామ పంచాయతీ నిర్వాహణను ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని ఒక గదిలో నిర్వ హిస్తున్నారు. దీంతో విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బంది ఏర్పడుతోంది. త్వరగా భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ..

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో విన్నపాలను, ప్రజల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ప్రజావాణిలో సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు కలెక్టరేట్‌కు తరలిరావడంతో కిటకిటలాడిపోయింది. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణిలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఆర్‌డీవో శేషాద్రిలు పాల్గొని సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 155 దరఖాస్తులు, ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో రెవెన్యూ శాఖకు 51, సిరిసిల్ల ఆర్డీవోకు 36, వేములవాడ మున్సిపల్ కమిషనర్‌కు 4, గృహ నిర్మాణ శాఖకు 14, ఉపాధికల్పన శాఖకు 8, అబ్కారీ శాఖకు 1, పంచాయితీరాజ్ శాఖకు 15, విద్యాశాఖకు 12, చేనేత జౌళి శాఖకు 1, ఎస్‌డీసీకీ 1, జిల్లా వైద్యాధికారికి 2 చొప్పున వచ్చిన ఫిర్యాదులు, వినతి పత్రాలు, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి త్వరగా పరిష్కారం చూపాలన్నారు. అలాగే అర్జీదారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో అక్రమాలను నివారించాలి

- సతీష్‌రెడ్డి, వట్టెంల, వేములవాడ రూరల్



వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై కలెక్టర్ స్పందించి విచారణ జరిపించాలి. మండలంలోని వట్టెంల గ్రామంలో మా తాతకు చెందిన భూమి ని తాము రిజిస్ట్రేషన్ చేసుకుని సాగు చేసుకుంటున్నామని అయి తే తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన వీఆర్‌వో రాజయ్య తమ భూమిని మరొకరికి అక్రమంగా పట్టాలను చేయించాడన్నారు. ఈ విషయమై తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదని, దీనిపై కలెక్టర్ స్పందించి విచారణ జరిపించి తమకు న్యాయం చేయాన్నారు.

రోడ్డును పునరుద్ధరించాలి..

- గంగుల మల్లయ్య, ఇప్పల్లపల్లె



సిరిసిల్ల పట్టణంలోని తుక్కారావుపల్లెలోని దుర్గమ్మ గుడి నుంచి పెద్దూర్ శివారులోని ఎద్దుగుట్ట వరకు ఉన్న ప్రభుత్వ రోడ్డును గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకుని రోడ్డును మూసివేశారు. కలెక్టర్ స్పందించి ఆ రోడ్డును పునరుద్ధించాలని కోరారు. పట్టణంలోని సాయినగర్ కార్గిల్ లేక్ వెనుక భాగం నుంచి ఉన్న వ్యవసాయ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం పొందిన నక్ష కలిగిన రోడ్డు పూర్వకాలం నుంచి ఎడ్లబాట పేరుతో ఉండేదని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు నక్ష కలిగిన రోడ్డును ఆక్రమించుకొని రోడ్డు లేకుండా చేశారని, దీనిపై కలెక్టర్ విచారణ జరిపించి అరోడ్డు నిర్మించాలని కోరారు.

నష్ట పరిహారం అందించి ఆదుకోండి..

- భారతమ్మ, గర్జనపల్లి, వీర్నపల్లి



వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన పశువుల కాపరి సింగం లక్ష్మీరాజం 25 సంవత్సరాల క్రితం మల్హర్ మండలంలోని కొయ్యూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. అప్పటి ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు, ఇప్పటివరకు పరిహారం ఇవ్వడం లేదు. నాకు ఆరోగ్యం బాగలేదు. కలెక్టర్ స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలి. గర్జనపల్లికి చెందిన సింగం లక్ష్మీరాజం అనే పశువులకాపరిని పోలీసులు పట్టుకొని వెళ్లగా కొయ్యూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీకి చెందిన అగ్రనేతలు నల్లా ఆదిరెడ్డి, ఎర్రం సంతోష్‌రెడ్డి, శీలం నరేష్‌లతోపాటు లక్ష్మీరాజం చనిపోయాడు, అప్పటికే వృద్ధురాలినైన నన్ను పోషించేందుకు ఎవరి లేరు. నన్ను నా ఇద్దరు ఆడ పిల్లలు పోషించుకుంటున్నారు. నాకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో నా పోషణ ఇబ్బందిగా మారింది. ఎన్‌కౌంటర్ జరిగిన సమయంలో నాకు నష్టపరిహారం అందిస్తామని అప్పటి ప్రభుత్వంతో పాటు అధికారులు హామీ ఇచ్చారని వాటిని అందించి నాన్ను అదుకోవాలని కోరారు.

సాగు భూములకు పట్టాలను అందించాలి..

- కలెక్టరేట్‌కు తరలివచ్చిన బద్దెనపల్లి లబ్ధిదారులు



భూమి కొనుగోలు పథకం కింద మాకు అందించిన భూములకు పట్టాలను అందించాలంటూ తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులు సోమవారం సిరిసిల్ల కలెక్టరేట్‌కు తరలి వచ్చారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి వినతి పత్రాన్ని అందించారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలో ఉన్న ఎస్సీ కులస్థులకు 1994 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం భూమి కొనుగోలు పథకం కింద భూమిని కొనుగోలు చేసి భూములు లేని 73 మంది లబ్ధిదారులకు అందించిందని తెలిపారు. అప్పటి నుంచి ఆ భూములలో తలా 10 గుంటలు, 15 గుంటల చొప్పున హద్దులను పెట్టుకుని సాగు చేసుకుంటున్నామని తెలిపారు. అయితే 73 మందికి ఇచ్చిన ఆ భూములకు సంబంధించిన పట్టాలను 40 మందికే ఇచ్చారని తెలిపారు. మిగిలిన 33 మందికి పట్టాలు లేకపోవడంతో బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి మిగిలిన 33 మందికి పట్టాలను అందించి అదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిలివేరి శాంతవ్వ, మాజీ సర్పంచ్ పోచయ్య, బాలవ్వ, కోలాపూరి బాలవ్వ, మంజుల, ఎల్లవ్వ, లక్ష్మీ, పుష్పలత, గడ్డం ఎల్లవ్వ, కోలాపూరి పద్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

భూముల హద్దులు చూపించండి..

- కలెక్టరేట్‌కు తరలివచ్చిన జిల్లెల్ల బాధితులు



తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్ల గ్రామంలో గతంలోని వైఎస్‌ఆర్ ప్రభుత్వం హయాంలో 15 మంది నిరుపేద దళిత కుటుంబాలకు చెందిన వారికి ఎకరం చొప్పున అప్పటి రెవెన్యూ అధికారులు పట్టాలను అందించారు. గ్రామశివారులోని సర్వేనంబర్ 1137లోని ప్రభుత్వ భూమిని అప్పటి సర్వేయర్ మాకు భూమి అందగా కొలిచి ఇచ్చారన్నారు. అప్పటి నుంచి ఆ భూముల్లో సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. అయితే తమ భూములకు ప్రక్కనే ఉన్న వ్యవసాయ భూములకు చెందిన వారు మమ్మలను బెదిరింపులకు గురిచేస్తూ మా భూములకు కబ్జా చేస్తున్నారని కలెక్టర్ స్పందించి అ భూములను పరిశీలించి సర్వేయించి తమకు కేటాయించిన భూములకు హద్దులు చూపించాలని గ్రామానికి చెందిన బర్ల వజ్రవ్వ, ఎర్రలక్ష్మీ, బచ్చపెల్లి రామవ్వ, మాట్ల రాజేశ్వరి, శ్రీరాముల పద్మ, బట్టు వజ్రవ్వ, బచ్చపెల్లి రేణవ్వ, గంటెపల్లి రాధవ్వ, బర్ల నర్సవ్వ, చింతమడక లక్ష్మీ తదితరులు జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించివేడుకున్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి..

- కలెక్టరేట్‌కు తరలివచ్చిన కొలనూరు గ్రామస్థులు



కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో అక్రమ వెంచర్‌పై స్థానికులు కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గతంలో చాలాసార్లు ఈ వెంచర్‌పై గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో మండల పంచాయతీ ఆఫీసర్ వెంచర్‌పై నివేదిక ఇచ్చి అందులో సైన్ బోర్డు పెట్టారని తెలిపారు. అయినప్పటికీ వెంచర్ నిర్వాహకులు బోర్డును తొలగించి నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు అమ్ముతున్నారని లేఖలో గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ వెంచర్లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, నిర్వాహకులు కబ్జా చేసి వెంచర్ వేశారని తెలిపారు. అధికారులు దీనిపై చర్యలు తీసుకొని గ్రామానికి రావలసిన 1 ఎకరం ఎనిమిది గుంటలతో పాటు రెండెకరాల ప్రభుత్వ భూమిని గ్రామానికి అందించాలని ప్రజలు వేడుకుంటున్నారు. దీనిపై స్పందించి గ్రామానికి రావలసిన భూమిని అప్పగించి గ్రమనికి న్యాయం చేయాలని లేఖలో తెలిపారు. కార్యక్రమంలో వి. తిరుపతి, శేఖర్, తిరుపతి, గణేష్, చందు లు ఉన్నారు.

చిన్నారుల కోసం ముందు'చూపు'

(5వ పేజీ తరువాయి)

తల్లిదండ్రులు, పిల్లల ఎదుగుదల, పెరుగుదలలో ఎదుర్కొంటున్న అవాంతరాలు, ఇబ్బందులను అంగన్‌వాడీ టీచర్ దృష్టికి తీసుకరావాలి. మెడికల్ అధికారి ద్వారా తగిన చికిత్సకు కౌన్సెలింగ్, ఇతర శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేస్తారు.

ప్రణాళిక ప్రకారం కంటి పరీక్షలు..



అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం ద్వారా చిన్నారులు, విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది రకాల అంశాలను పరిశీలిస్తారు. బస్వాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య పరీక్షలను పరిశీలించి ఏమైనా లోపాలు గుర్తించిన పిల్లలకు మందులు అందజేయాలని సూచించారు. ఎక్కువ ఇబ్బంది పడే విద్యార్థులకు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందించాలి.

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

చిన్నారులకు ఎంతో ఉపయోగం..



అంగన్‌వాడీ కేంద్రాల్లో నేత్ర పరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షలు చిన్నారులకు ఎంతో ఉపయోగపడుతాయి. జిల్లాలో 587 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ ప్రారంభించాం. ఆరు సంవత్సరాలలోపు పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ప్రత్యేక ప్రశ్నావళి ప్రకారం నిర్ణీత సమయానికి అభివృద్ధి దశలను అందుకుంటున్నారా, వెనబడుతున్నారా, మైలురాళ్లు చేరుతున్నారా, రిస్క్ అంశాలను గుర్తించడానికి ఈ స్మార్ట్ చెక్ ఎంతో ఉపయోగపడుతుంది.

- డాక్టర్ రజిత, జిల్లా వైద్యాధికారి

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి

- డాక్టర్ వేదచారి, మండల వైద్యాధికారి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి?

మెడికల్ ఆఫీసర్: ప్రతినెలలో ఒకటి రెండు ప్రసవాలు జరుగుతున్నాయి. తల్లి బిడ్డ క్షేమంగా ఉంటున్నారు.

ఆంధ్రజ్యోతి: రోగులకు మందులు అందుబాటులో ఉన్నాయా?

మెడికల్ ఆఫీసర్: ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. మందుల కొరత లేదు.

ఆంధ్రజ్యోతి: రోజుకి ఎంతమందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు?

మెడికల్ ఆఫీసర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజు 80నుంచి 90మంది వరకు రోగులు వస్తున్నారు. వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నాం. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం.

- చందుర్తి(ఆంధ్రజ్యోతి)

అంగన్‌వాడీ చిన్నారులకు పరీక్షలు



చిన్నారి బరువు చూస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కోనరావుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే చిన్నారులకు సోమవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బ్లైండ్ నెస్ ప్రివెన్షన్ వీక్ (అంధత్వ నివారణ వారోత్సవాలను) పురస్కరించుకొని మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని 6 నెలల నుంచి 6 ఏండ్లలోపు పిల్లలందరికీ కంటి వైద్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం ఆర్‌బీఎస్‌కే వారి ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. ఏమైనా లోపాలు గుర్తించిన పిల్లలకు మందులు అందజేస్తారని, ఎక్కువ ఇబ్బంది పడే విద్యార్థులకు ప్రభుత్వ దవాఖానాల్లో వైద్యం అందిస్తామని అన్నారు. ధర్మారం గ్రామంలోని అన్ని సెంటర్లు 138 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని తెలిపారు. ఈకార్యక్రమాల్లో సూపర్‌వైజర్ కనకమ్మ, అంగన్‌వాడీలు జొన్నల అరుణ, వెలిశాల రమాదేవి, నేరెళ్ల చంద్ర కళ, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట మండల అభివృద్ధికి వంతు కృషి



సుద్దాలలో వాహనాన్ని అందజేస్తున్న శ్రీకుమార్

కోనరావుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కోనరావుపేట మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్ అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన బాదినేని శ్రీనివాస్ వికలాంగుడికి మూడు చక్రాల వాహనాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోనరావుపేట మండలంలోని పలు పేద ప్రజలకు చెవి వినికిడి యంత్రాలు, మూడు చక్రాల వాహనాలను అందిస్తున్నానని గుర్తు చేశారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజల వెంటే ఉంటూ ప్రజల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు ఎర్రబెల్లి నాగరాజు, కొలనూరు సింగిల్‌విండో వైస్ చైర్మన్ కాశవేణి మహేష్, సుద్దాల మాజీ ఎంపిటిసి మమతా మహేష్, ఉప్పుల శంకర్, మాసం సుమన్, కుంటేల్లి రాజయ్య, కర్నాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో ఘనంగా శోభయాత్ర..

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామంలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి హనుమాన్ శోభాయాత్రను దీక్షపరులు ఘనంగా నిర్వహించారు. పల్లకిపై కొలువుదీరిన స్వామివారిని నాంపల్లి వీధుల్లో ఊరేగించారు. హనుమాన్ పాటలకు భక్తులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నాంపల్లి గ్రామస్థులు, హనుమాన్ దీక్షపరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. అర్చకులు వెంకటాచార్యులు, శ్రీనాథాచార్యులు, స్వాగత్‌కుమారాచార్యులు ఆధ్వర్యంలో గ్రామ వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. యాగశాల ప్రవేశం, జలాధివాసం, అభిషేకం, తదితర కార్యక్రమాలను జరిపించారు. ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పలువురు తాజా, మాజీ ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ మండల కార్యవర్గం

తంగళ్లపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల డీటీఎఫ్ అధ్యక్షునిగా శ్రీరామ అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా జక్కని శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జయప్రద, విక్రమ్, వెంకటలక్ష్మీలు కార్యదర్శులుగా లింగారెడ్డి, శైలజ, జిల్లా కౌన్సిలర్లుగా రాజేశం, ఆరాధన, శ్రీనివాస్, మహేందర్ నరసయ్యలు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా తిరుపతి సభ్యులుగా రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చిన్నారులకు కంటి పరీక్షలు చేయాలి



చిన్నారితో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

తంగళ్లపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే ప్రతి చిన్నారికి కంటి వైద్య పరీక్షలు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. సోమవారం తంగళ్లపల్లి మండలంలోని బస్వాపూర్ అంగన్‌వాడీ కేంద్రలలో పిల్లల ఆరోగ్య స్మార్ట్‌చెక్ కార్యక్రమాన్ని కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పిల్లలకు సంబంధించి తొమ్మిది రకాల అంశాలను పరిశీలిస్తారని, తల్లిదండ్రులు వారి పిల్లల ఎదుగుదల, పెరుగుదల, నైపుణ్యాల విషయంలో ఎదుర్కొంటున్న అవాంతరాలను ఇబ్బందులను అంగన్‌వాడీ టీచర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మధ్య సిబ్బంది ఏమైనా లోపాలుంటే గుర్తించి పిల్లలకు మందులు అందజేయాలని సూచించారు. ఇబ్బందిపడే విద్యార్థులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందించడంతో పాటు శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారని తెలిపారు. జిల్లాలోని ఆ ప్రతి ఆరు సంవత్సరాలలోపు పిల్లల ఉన్న తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినీ చేసుకోవాలన్నారు. సంక్షేమ అధికారి లక్ష్మీరాజం మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలోని నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందని దానికి అనుగుణంగా జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వైద్యాధికారి రజిత, వైద్యులు నయామాజహా, సంపత్, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ..

తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠ శాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, పాఠాలు బోధిస్తున్న తీరు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



నిమ్మపల్లిలో పాదయాత్రలో పాల్గొన్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నాడని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్న బియ్యం లబ్ధిదారుని గిరిజన ఇంట్లో గిరిజనులతో కలిసి భోజనం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృఢ సంకల్పంతో రాష్ట్రంలో మేనిఫెస్టోలో పెట్టకుండా కొన్ని పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి మళ్లీ మనకు అందించారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా ప్రజలకు సన్న బియ్యం కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. వేములవాడ నియోజకవర్గానికి సుమారు 800 కోట్ల పనులకు శంకుస్థాపన చేశామన్నారు. గత30 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గీకరణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పకడ్బందీగా నిర్వహించి శాసనసభలో అమలు చేశారని అన్నారు. ఏఐసీసీ, పీసీసీ ఇచ్చిన పిలుపుమేరకు జైబాబు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలు నిర్వహిస్తున్నామన్నారు రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిపైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మండల కోఆర్డినేటర్ గడ్డం నరసయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, జిల్లా నాయకుడు చేపూరి గంగాధర్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, నాయకులు తాళ్లపల్లి ప్రభాకర్, నందు గౌడ్, కర్రోళ్ల భాస్కర్, నాలుక సత్యం, నీరటి సంజీవ్, ఉప్పుల గంగయ్య, పెంతల శ్రీనివాస్, మానుక సత్యం, వాల్యా మల్లారెడ్డి, నాయక్, మానుక సత్యం, సదానందం, నాగండ్ల భూమేష్, సుంకరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో బీజేపీ, తెలంగాణలో బీఆర్‌ఎస్ పది సంవత్సరాలు ప్రజాస్వామ్యంను కాలరాసిన రెండు పార్టీలు చీకటిలో దోస్తులేనని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్‌లో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జెండాను కేకే మహేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్‌లో భాగంగా రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను కేకే మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం పట్టణ ప్రధాన రహదారుల గుండా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాదయాత్రను చేపట్టారు. అనంతరం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడారు. బీజేపీ కుటిల యత్నాన్ని తిప్పికొట్టడం కోసం భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జోడా యాత్రను చేశాడని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూపతిరపతిరెడ్డి, ఏఐసీసీ అబ్జర్వర్ అవీజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళ అశోక్, ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, పద్మశాలి సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మాజీ కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● గంబీరావుపేట : గంబీరావుపేట మండలం శ్రీగాధ, కోళ్ళమద్ది, దేశాయిపేట, నర్మాల గ్రామాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో రాజ్యంగ పరిరక్షణ పాదయాత్రను చేపట్టారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, ఇందిరాగాంధీ, సాకలి ఐలమ్మ విగ్రహాలకు పూల మాలలు వేశారు. జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమంలో బాగంగా నాలుగు గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మెన్ అంజిరెడ్డి, డైరెక్టర్లు ప్రబాకర్, రాజం, విఠల్, అజాం, రాజనర్సు, మండల యూత్ అధ్యక్షుడు గంగి స్వామి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సురేష్, సోషల్ మీడియా ఇంచార్జీ గౌరిశంకర్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.



సిరిసిల్లలో పాదయాత్రంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు

హనుమంత వాహనంపై ఊరేగిన రామయ్య..



స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారు హనుమంత వాహనంపై ఊరేగారు. దేవతామూర్తులను గరుడ వాహనంపై ప్రతిష్టి గ్రామ పుర వీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళ హారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. రామనామ స్మరణతో గ్రామమంతా మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచులు నర్సయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, నాయకులు హన్మండ్లు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాముడి పట్టాభిషేక వేడుకలు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో సోమవారం శ్రీరాముని పట్టాభిషేక వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతి సంవత్సరం సీతారాముల కళ్యాణోత్సవం జరిగిన తర్వాతి రోజు పట్టాభిషేక వేడుకలు జరుగడం ఆనవాయితీగా కొనసాగుతుంది. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, అర్చకుడు రాజేశ్వరశర్మ, నాయకులు నార్ల రాంకిషన్, ఏగుర్ల శ్రీనివాస్, దొంతుల శంకర్, విజయ్, బండారి నర్సయ్య, అంతగిరి భాస్కర్, హరికుమార్, కాసుపాక కిషన్, మామిడి నర్సయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా జ్యోతి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలుగా వెలిచాల జ్యోతిని నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత పేర్కొన్నారు. మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన జ్యోతి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తుంది. జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని అందించి, పార్టీ అభివృద్ధికి పాటుపడాలని జిల్లా అధ్యక్షురాలు సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నాయకులు ముత్యం అమర్, ప్రసాద్, నేరెళ్ళ విజయ్, కొమురయ్య, రోషాలు, సంతోష్, లక్ష్మన్, మల్లయ్య, సరిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

కథలాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన దళితబంధు నిధులు విడుదల చేసి లబ్ధిదారు లకు అందించాలని సోమవారం కలెక్టర్ సత్యప్రసాద్‌కు ప్రజావాణిలో వినతి పత్రం అందించినట్లు మండల దళితబంధు సాధన సమితి అధ్యక్షుడు తీట్ల శంకర్ తెలిపారు. కలెక్టర్ ఖాతా ల్లోకి అప్పటి సర్కారు నిధులు విడుదల చేసిందని ఎంపికైన లబ్ధిదారులకు ఎందుకు పథకం వర్తింపజేయడం లేదని ప్రశ్నిం చారు. వెంటనే నిధులు లబ్ధిదారులకు అందించి యూనిట్ల స్థాపనకు సహకరించి నిరు పేదలకు ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా బాల్కి సంజీవ్, ఊడుగుల ఓంకార్, గంగాధర్ ఉన్నారు.